సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జార్జ్ కురియన్

ఎగ్ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తా..

కేంద్రమంత్రి జార్జ్ కురియన్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 21 : కేంద్ర కౌన్సిల్‌లో చర్చించి ఆలిండియా ఎగ్ బోర్డు ఏర్పాటు కోసం కృషి చేస్తానని కేంద్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ శాఖల మంత్రి జార్జ్ కురియన్ అన్నారు. హనుమకొండలోని అశోకా కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ పౌల్ట్రీ ఫార్మర్స్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కోళ్ల వ్యాధుల నివారణకు వ్యాక్సిన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కేంద్రం పౌల్ట్రీ పరిశ్రమల నిర్వాహకులకు అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. 109 రకాల గడ్డి పెంచుకోవడానికి కేంద్రం అనుమతి ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. వరంగల్ పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. కరోనా కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోయిందని, దేశంలో 21శాతం పౌల్ట్రీఫామ్స్‌ను మూసివేసినట్లు చెప్పారు. అనంతరం పౌల్ట్రీ ఫార్మర్స్ పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కేంద్రమంత్రికి అందజేశారు. ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి రాంప్రసాద్, ఉపాధ్యక్షులు రామణారెడ్డి, శ్యాంసుందర్‌రావు, రవీందర్, సుబ్బారావు, శ్రీరాంనాయక్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బుల్లితెర నటుడు ప్రభాకర్, పక్కన రామ్‌నగర్ బన్నీ సినిమా హీరో చంద్రహాస్, హీరోయిన్లు

'రామ్‌నగర్ బన్నీ' సినిమాను ఆదరించండి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 21: బుల్లితెర నటుడు ప్రభాకర్ తనయుడు చంద్రహాస్ హీరోగా పరిచయమవుతున్న 'రామ్‌నగర్ బన్నీ' చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని డైరెక్టర్ శ్రీనివాస్ కోరారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చూసి ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుందని, కామెడీ, సాంగ్స్, ఫైట్స్ అందరికీ నచ్చుతాయన్నారు. 'మా నాన్న ప్రభాకర్ పేరు నిలబెట్టేలా కష్టపడతానని, 'రామ్‌నగర్ బన్నీ'గా మీ ముందుకు తొలిసారి రాబోతున్నానని, ఇది అందరికీ కనెక్టయ్యే సినిమా అని హీరో చంద్రహాస్ అన్నారు. ఈ సినిమా వసూళ్లలో పది శాతం వరద బాధితుల సహాయార్థం రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు ఇవ్వాలని నిర్ణయించామని పేర్కొన్నారు. తన అబ్బాయి చంద్రహాస్ మొదటిసారి హీరోగా నటించిన చిత్రం 'రామ్‌నగర్ బన్నీ' అక్టోబర్ 4న రిలీజవుతుందని, అందరూ ఆదరించాలని బుల్లితెర నటుడు ప్రభాకర్ కోరారు. హీరోయిన్లు విస్మయశ్రీ, రిచాజోషి ఉన్నారు.

పరకాల పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈవోగా నాగరాజు

పరకాల, సెప్టెంబర్ 21 : పరకాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్‌చార్జి సీఈవోగా నీరటి నాగరాజును నియమిస్తూ పాలకవర్గం తీర్మానం చేసినట్లు చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ప్రస్తుత సీఈవో ఆకుల రమేశ్‌బాబును సస్పెండ్ చేస్తూ ఏకగ్రీవ తీర్మానం ఆమోదించడంతోపాటు ఇన్‌చార్జి సీఈవోగా నాగరాజును నియమిస్తూ తీర్మానం చేశారు. నోడల్ అధికారి దేవేందర్‌రెడ్డి, ఆడిటర్ రవీంద్ర పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ We are Hiring **PHARMACIST** (B.Pharmacy/M.Pharmacy). Fresher/ Experienced, PCI Certificate Must.Receptionist with 1Year experience(Min)Anaesthesia Technician with 2 Year experience(Min) Send your Resume to koorapatiads@gmail.com for more information Cont: **7337222096**.
NTW-000

★Doctor/Gynaecologist (DGO/MS), X-Ray Technician, Lab Technicians, PRO's, Staff Nurses, Receptionist to work in Multispeciality Hospital in Madikonda, Hanamkonda. Cell: 9951020366
NTW-314815

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

PLOT FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

BUSINESS OFFER

★మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతినెలా ఆదాయం కావాలా? మీ దుకాణానికి ప్రచార ప్రకటనలు జోడించి ప్రతినెలా 7,000/- ఇస్తాము. Ph: 9948000371, 9948000373.
NT-338751-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

స్వరాష్ట్ర ఉద్యమ చిరునామా లక్ష్మణ్ బాపూజీ

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- జిల్లా వ్యాప్తంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి
- ఘనంగా నివాళులు అర్పించిన నాయకులు

హనుమకొండ, సెప్టెంబర్ 21 : స్వరాష్ట్ర సాధన ఉద్యమానికి చిరునామా కొండా లక్ష్మణ్ బాపూజీ అని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. వినయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ రాష్ట్ర సాధన తొలి, మలిదశ ఉద్యమాల కేంద్రం లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. నాడు టీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల నిర్వహణకు జలదృశ్యంలోని తన ఇంటిని కేటాయించారని గుర్తుచేశారు. కేసీఆర్, జయశంకర్ సార్లతోపాటు తెలంగాణ సమాజం కోసం జీవించిన మహనీయుడు లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. వారి గౌరవార్థం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టారని తెలిపారు. కుడా మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ముదిరాజ్, నాయకులు నయీమొద్దీన్, జానకీరాములు, ప్రణయ్, రఘు, మిట్టపల్లి రమేశ్, విద్యార్థి నాయకులు బైరపాక ప్రశాంత్, గంద్రకోట రాకేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

పరకాల బస్‌డిపో సర్కిల్‌లో..

పరకాల: పట్టణంలోని బస్‌డిపో సర్కిల్‌లో ఉన్న లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) అధ్యక్షుడు డాక్టర్ పి.రాజేశ్వరప్రసాద్ వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోపా బాధ్యులు మెండు రవీందర్, బాసాని దయాకర్, రాచర్ల అశోక్, చిదురాల దేవేందర్,

లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

పరకాల: లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు

దుంపేటి నాగరాజు పాల్గొన్నారు. పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి పాల్గొన్నారు. పద్మశాలి యువజన సంఘం బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

హనుమకొండ చౌరస్తా: కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్లు ఏ.నాగరాజు, రావుల సదానందం, నెక్కొండ కిషన్, సీనియర్ నాయకులు దేవన విష్ణువర్ధన్‌రెడ్డి, కొలిపాక సతీష్, మండల సమ్మయ్య, నాయిని లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

శాయంపేట మండల కేంద్రంలో..

శాయంపేట: తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి వంగరి సాంబయ్య, మాజీ వార్డు సభ్యుడు వడ్డెపల్లి శీను, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. చింత రవి, మార్త సుమన్, బాసాని మార్కండేయులు, కందగట్ల సంతోష్, భద్రయ్య, తరుణ్, ప్రపంచరెడ్డి, బాసాని రవి, కట్టయ్య, వలుపదాసు రాము ఉన్నారు.

ఆత్మకూరు మండల కేంద్రంలో..

ఆత్మకూరు: మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి జరిగింది. లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు వెల్దే వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ ఇర్సడ్ల సదానందం, మండల కోశాధికారి వడ్డెపల్లి ప్రసాద్, యూత్ అధ్యక్షుడు మార్త రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

న్యూశాయంపేట: హనుమకొండ హంటర్ రోడ్‌లోని ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ భవన్ ప్రాంగణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ట్రస్ట్ చైర్మన్, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు పూలమాల వేసి నివాళులు అర్పించారు. లక్ష్మణ్ బాపూజీ జయంతి, వర్ధంతి అధికారికారంగా నిర్వహించాలని, టెక్స్‌టైల్ పార్క్‌కు ఆయన పేరు పెట్టాలని కోరారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, జిల్లా పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు ఆనందం, పద్మశాలి సేవా సంఘం నాయకులు వేముల సదానందం, పాశిగంటి రాజేందర్, గుండు సదానందం పాల్గొన్నారు.

పరకాల : లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న పోపా బాధ్యులు

శాయంపేట : లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సాంబయ్య, శ్రీను


ఆత్మకూరు: మండల కేంద్రంలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పద్మశాలీ నాయకులు

23న పోల్ క్లైంబింగ్ టెస్ట్

హనుమకొండ, సెప్టెంబర్ 21 : జూనియర్ లైన్‌మెన్స్‌కు ఈనెల 23వ తేదీన పోల్ క్లైంబింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సోమవారం ఉదయం 9గంటలకు ములుగు రోడ్డులోని ఉత్తర విద్యుత్తు శిక్షణ సంస్థ (ఎన్‌పీటీఐ)లో హాజరు కావాలన్నారు.

పిడుగుపాటుతో రెండు గేదెల మృతి

ఆత్మకూరు, సెప్టెంబర్ 21 : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో తుప్పరికట్టస్వామికి చెందిన రెండు పాడి గేదెలు శుక్రవారం రాత్రి పిడుగుపాటుతో మృతిచెందాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రాగా, ఒక్కసారిగా పశువుల కొట్టంపై పిడుగు పడి మృతిచెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని స్వామి కోరాడు.

అక్రమ వెంచర్ హద్దురాళ్లను తొలగిస్తున్న అధికారులు

అక్రమ వెంచర్ హద్దురాళ్ల తొలగింపు

దామెర, సెప్టెంబర్ 21 : ఆరెపల్లి ప్రతిమ క్యాన్సర్ ఆస్పత్రి–దామెర మార్గమధ్యలోని కల్వర్టు వద్ద ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా చేసిన వెంచర్ హద్దురాళ్లను ఎంపీవో రంగాచారి, పంచాయతీ కార్యదర్శి మనోహర్‌రెడ్డి శుక్రవారం తొలగించారు. ట్రాక్టర్ డోజర్‌తో వెంచర్‌లోని హద్దు రాళ్లను తొలగించిన అనంతరం ఎంపీవో మాట్లాడుతూ.. వెంచర్‌కు ప్రభుత్వ అనుమతులు లేవని, నోటీసులు ఇచ్చి హద్దురాళ్లను తొలగించామన్నారు. నిర్వాహకులు తిరిగి హద్దురాళ్లను ఏర్పాటు చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రాజు(ఫైల్)

ఐనవోలు, సెప్టెంబర్ 21 : అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందిన ఘటన శనివారం వెలుగు చూసింది. స్థానికులు, ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కక్కిరాలపల్లికి చెందిన పిట్టల రాజు(26) గ్రామంలోని ఖాళీగా ఉన్న పాత ఇంటి సమీపంలోని చెట్ల పొదల్లో టార్పాలిన్‌పై మృతదేహమై కనిపించాడు. దుర్వాసన వస్తుండడంతో గ్రామస్తులు పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రీనివాస్, పోలీసులు మృతదేహంగా గుర్తించి పోస్టుమార్టం కోసం హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'డే కేర్' సెంటర్‌కు రూ.4.6లక్షల విడుదల

హనుమకొండ, సెప్టెంబర్ 21 : జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో 'డే కేర్ సెంటర్' కోసం కేటాయించిన భవన ఆధునీకరణకు రూ. 4.6 లక్షలు కలెక్టర్ ప్రావీణ్య విడుదల చేశారని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్ తెలిపారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, 'ఓరుగల్లు రక్షణ సమితి' హనుమకొండ ఉభయ సంస్థల ప్రాతినిధ్యం మేరకు జిల్లాలో మొట్టమొదటగా సీనియర్ సిటిజన్స్ కోసం డే కేర్ సెంటర్ భవనం కేటాయించి, పూర్తి హంగుల కోసం నిధులు కేటాయించినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్, విజిలెన్స్ కమిటీలను పునరుద్ధరించి వినియోగదారులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఆహార విజిలెన్స్ కమిటీలో 'ఓరుగల్లు వినియోగదారుల రక్షణ సమితి'కి సంస్థాగత ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి మార్క రవీందర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు మలహల్‌రావు, ఓరుగల్లు వినియోగదారుల రక్షణ సమితి అధ్యక్షుడు కుజాంపురం దామోదర్, పరికిపండ్ల వేణు ఉన్నారు.

కలెక్టర్ ప్రావీణ్యను కలిసిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

నూతన సాంకేతిక జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

నిట్ ప్రొఫెసర్ ఆంజనేయులు

ధర్మసాగర్, సెప్టెంబర్ 21 : విద్యార్థులు నూతన సాంకేతిక జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని నిట్ ప్రొఫెసర్ ఆంజనేయులు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ అధ్యక్షతన 'మానవ సంక్షేమంలో శాస్త్రీయ దృక్పథం – డిజిటల్ విప్లవం పాత్ర' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాచార, కృత్రిమ మేధ విప్లవంతో జ్ఞానం అందరికీ అందుబాటులోకి వచ్చిందని, దాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మానవ అవసరాలను అర్థం చేసుకుని సృజనాత్మకతకు పదును పెడితే సైన్స్ పరిణామం చెందుతుందన్నారు. సైన్స్, సాంకేతిక పరిజ్ఞానంతో పారిశ్రామిక పెట్టుబడి పెరిగిందని, ఉద్యోగావకాశాలు పెంపొంది పేదరికం తగ్గిందన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి మంజుల, అధ్యాపకులు రాములు, బాబూరావు, వెంకట్, సదానందం, గోపాలకృష్ణ, రాజేందర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిట్ ప్రొఫెసర్ ఆంజనేయులు

ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని జీవితంలో రాణించాలి

పరకాల, సెప్టెంబర్ 21 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని జీవితంలో రాణించాలని ఆర్డీవో నారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓరియంటేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉంటారని, వారు అందించే విద్యతో పాటు సూచనలు, సలహాలతో జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఏసీపీ కిశోర్ కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నారాయణ

నేడు ఎస్డీఎల్సీఈలో ఎస్సీ వర్గీకరణపై రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 21 : కాకతీయ యూనివర్సిటీ ఎస్డీఎల్సీఈలోని ప్రొఫెసర్ జాఫర్ నిజాం హాల్లో ఆదివారం ఎస్సీ వర్గీకరణపై మానవ హక్కుల వేదిక రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అద్దునూరి యాదగిరి, దిలీప్ తెలిపారు. ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని, సామాజిక న్యాయం అమలులో భాగంగా ఈ తీర్పును ఎలా చూడాలి? దీని అమలు సాధ్యాసాధ్యాలు ఏమిటి? ఎస్సీ వర్గాల్లోని అనుబంధ కులాల్లో నెలకొని ఉన్న వెనకబాటుతనాన్ని తొలగించడం ఎట్లా? దానికి సుప్రీంకోర్టు తీర్పు ఏ విధంగా దోహదపడగలదో చర్చించడం కోసం అందరూ హాజరవ్వాలని వారు కోరారు.

ట్రాఫిక్ కేసుల బాధితులు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

కాజీపేట, సెప్టెంబర్ 21 : వివిధ ట్రాఫిక్ కేసుల్లోని బాధితులు హనుమకొండ రెండో తరగతి న్యాయస్థానం ఈ నెల 23 నుంచి వారం రోజుల పాటు నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ట్రాఫిక్ సీఐ నాగబాబు సూచించారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మైనర్లు డ్రైవింగ్ చేసి పోలీసులకు పట్టుబడిన, వాహనాలు సీజ్ అయిన వారు లోక్ అదాలత్‌కు హాజరై న్యాయమూర్తి విధించే జరిమానాలు చెల్లించి కేసులను క్లోజ్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8712685110, 8712544274 సంప్రదించాలని కోరారు.

ప్రమాదాల నివారణకు ఆర్టీసీ చర్యలు

- హనుమకొండ బస్‌స్టేషన్‌లోకి నడక మార్గం బంద్
- రాకపోకలకు ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు

హనుమకొండ బస్‌స్టేషన్‌లోకి ప్రయాణికులు రాకుండా ఏర్పాటు చేసిన తాడుతో ఆర్టీసీ సిబ్బంది

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 21 : ప్రమాదాలను నివారించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. హనుమకొండ బస్‌స్టేషన్‌లో ఇటీవల బస్సు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు నడకమార్గంలో లోపలికి రాకుండా తాడు కట్టారు. ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా ఫెన్సింగ్‌తో ఓ గ్యాలరీని ఏర్పాటు చేశారు. అందులో నుంచే లోపలికి అనుమతిస్తున్నారు. బస్సులు బయటకు వచ్చే క్రమంలో గమనించని డ్రైవర్ల తప్పిదాల వల్ల బస్సు కిందపడి పలువురికి గాయాలయ్యాయి. షాపుల ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీ నుంచి ప్రయాణికులు లోపలికి రావాలని ఆర్టీసీ ఆర్ఎం విజయభాను తెలిపారు.

పండ్ల మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

వాటర్ ట్యాంక్ వద్ద పిచ్చిమొక్కలను తొలగిస్తున్న అధికారులు

ఆత్మకూరు, సెప్టెంబర్ 21 : రైతులు పండ్ల మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం కామారం గ్రామంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కోర్లినేషన్ చేయడంతో పాటు వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ ఏడాది ఉపాధి హామీలో నాటిన మునగ, మామిడి మొక్కలను పొలాల వద్దకు వెళ్లి పరిశీలించారు. రైతులు పండ్ల మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో రాజిరెడ్డి, ఈసీలు శ్రీధర్, రాము, పంచాయతీ కార్యదర్శి లావణ్య, టీఏ శ్రీధర్, ఎఫ్ఏ సుధాకర్ పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూలో జంతువుల నెయ్యి వాడకంపై విచారణ చేపట్టాలి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 21 : హిందువుల పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో జంతువుల నెయ్యితో లడ్డూ ప్రసాదాన్ని తయారుచేసిన అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ వరంగల్ విభాగ్ సహ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. వీహెచ్‌పీ నాయకులు కేసిరెడ్డి జైపాల్‌రెడ్డి, వెలగందుల రాజు, ఆదిత్యసాయి పాల్గొన్నారు.

పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలి

పరకాల, సెప్టెంబర్ 21 : పాఠశాల భవనాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత (సక్సెస్)పాఠశాలలో అసంపూర్తి నిర్మాణాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాఠశాలలో అదనపు తరగతి గదుల కోసం జరుగుతున్న నిర్మాణాలను పట్టించుకోకపోవడంతో మధ్యలోనే ఆగిపోయిందని విమర్శించారు. ప్రశాంత్, హేమంత్, కల్యాణ్ పాల్గొన్నారు.

కేఎంసీలో హెల్త్‌రన్‌ను ప్రారంభిస్తున్న సీఐ సతీశ్

కేఎంసీలో ఉత్కర్ష-24 ప్రారంభం

వరంగల్‌చౌరస్తా/హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 21: కాకతీయ మెడికల్ కళాశాలలో ఉత్కర్ష–24 వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిత్య జీవితంలో వ్యాయామం అవసరమనే విషయాన్ని గుర్తుచేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేఎంసీ నుంచి పబ్లిక్ గార్డెన్స్ వరకు హెల్త్‌రన్ నిర్వహించారు. హెడ్‌క్వార్టర్స్ జంక్షన్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హనుమకొండ సీఐ సతీశ్ హాజరయ్యారు.

విద్యార్థులకు సైకాలజీపై అవగాహన

కమలాపూర్, సెప్టెంబర్ 21 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైకాలజీపై డాక్టర్ ప్రహసిత్ శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, హెచ్ఈవో రవీందర్ పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ'ను పరిశీలించిన జడ్పీ సీఈవో

ఐనవోలు, సెప్టెంబర్ 21 : స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని జడ్పీ సీఈవో విద్యాలత పరిశీలించారు. శనివారం మండలంలోని పున్నేలు, ఐనవోలు గ్రామాలను సందర్శించారు. వాటర్ ట్యాంక్ క్లోరినేషన్, పిచ్చి మొక్కల తొలగింపు, ఆయిల్ బాల్స్ వేయడం, నర్సరీల సందర్శన, ఓపెన్ వెల్స్ క్లోరినేషన్ పనులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ డాక్టర్ సరిత, పంచాయతీ కార్యదర్శులు అశోక్, కిశోర్ ఉన్నారు.

మాట్లాడుతున్న పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఆత్మకూరు, సెప్టెంబర్ 21 : గ్రామాల్లో గుడుంబా, బెల్ట్‌షాపులు నడిపిస్తే సహించేది లేదని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని అక్కంపేట గ్రామంలో 'కార్డన్ సెర్చ్' నిర్వహించారు. ఇంటింటా సోదాలు చేశారు. గ్రామంలోని ప్రతి వాహనాన్ని పరిశీలించారు. బెల్ట్ షాపుల్లో ఉన్న మద్యం, గుడుంబా, సరైన పత్రాలు లేని రెండు ఆటోలు, 9 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పరకాల, ఆత్మకూరు సీఐలు క్రాంతికుమార్, సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

కమలాపూర్, సెప్టెంబర్ 21 : తెలంగాణ ఉద్యమకారులకు నివేశన స్థలాలు ఇవ్వాలని ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సాధన కోసం పలు రాజకీయ పార్టీల నాయకుల, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు ఉద్యమంలో పాల్గొని పోలీసు కేసులు, జైలు జీవితం అనుభవించి కోర్టుల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఉద్యమకారులకు నివేశన స్థలాలను ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి ఇప్పటివరకు ఎలాంటి చొరవ తీసుకోలేదన్నారు.